సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 5 । జనవరి । 2024



కార్పొరేట్ హంగులు

విద్యార్థుల్లో చదువుతో పాటు శారీరక ధారుడ్యం పెంపొందించేలా ఆటలపై దృష్టి సారించాలని నిర్ణయించారు. 8లో▸



ఫార్మాసిటీపై అపోహలొద్దు

భూసేకరణ చేపట్టిన ప్రతిపాదిత గ్రామాల్లో ఎట్టి పరిస్థితిల్లో ఫార్మాసిటీని పెట్టేది లేదని మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి అన్నారు. 8లో▸



అండగా ఉండాలి

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొత్త ప్రభుత్వం కూడా అమలు చేయాలని ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్: 2024–25 విద్యా సంవత్సరానికి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 6వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని మొయినాబాద్‌లోని శంకర్‌పల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జయమ్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు గురుకులంలో ప్రవేశానికి వెంటనే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఫిబ్రవరి 11న ఉదయం 11 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు.

‘ప్రజాపాలన’ పకడ్బందీగా చేపట్టాలి



మోకిలలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఉపాధి హామీ పీడీ ప్రభాకర్

శంకర్‌పల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని ఉపాధి హామీ పీడీ ప్రభాకర్ పేర్కొన్నారు. మండలంలోని మోకిల గ్రామంలో గురువారం నిర్వహించిన ప్రజా పాలనలో భాగంగా దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. సరిపడా దరఖాస్తులను అందుబాటులో ఉంచాలని సూచించారు. మున్సిపల్ పరిధిలోని 3, 14, 5వ వార్డుల్లో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకయ్యగౌడ్, కమిషనర్ జ్ఞానేశ్వర్, ఏపీఓ నాగభూషణం మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మోకిల సీఐగా వీరబాబు

శంకర్‌పల్లి:మోకిల సీఐగా వీరబాబుని నియమిస్తూ సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు.శంషాబాద్ సీసీఎస్ నుంచి బదిలీపై ఆయన మోకిలకు వచ్చారు. మోకిల సీఐగా పని చేసిన సీఐ నరేష్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో హైదరాబాద్ రేంజ్ డీఐజీ కార్యాలయానికి సరెండర్ చేసిన విషయం తెలిసిందే.మోకిలలో ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న కృష్ణను రాజేంద్రనగర్ పరిధిలోని అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.


పెండింగ్ వేతనాలు ఇప్పించండి



ట్రెసా ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ధరణి ఆపరేటర్లు

మొయినాబాద్: తహసీల్దార్ కార్యాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్ చేసే ధరణి కంప్యూటర్ ఆపరేటర్లకు తొమ్మిది నెలల పెండింగ్ జీతాలను వెంటనే ఇప్పించాలని ధరణి ఆపరేటర్లు ట్రెసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌కు విన్నవించారు. వివిధ మండలాల్లో పనిచేసే ధరణి ఆపరేటర్లు గురువారం మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో గౌతమ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సెంట్రిక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా తాము ఆపరేటర్లుగా పనిచేస్తున్నామని.. తమకు 2021 జూలై వరకు రూ.9,878, ఆ తరువాత రూ.11,583 వేతనాలు ఇస్తున్నారన్నారు. అవి కూడా ఏ ఒక్క నెలలో సక్రమంగా చెల్లించలేదన్నారు. 2023 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు 9 నెలల జీతాలు ఇవ్వలేదని.. కుటుంబ పోషణ భారమవుతోందని.. రవాణా చార్జీలకు సైతం డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించడంతోపాటు ఆపరేటర్ల జీతాలను రూ.31,040కి పెంచాలని.. మహిళా ఆపరేటర్లకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని కోరారు.

మహేశ్వరం డీసీపీగా సునీతారెడ్డి



మహేశ్వరం: మహేశ్వరం డీసీపీగా సునీతారెడ్డి నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన సీహెచ్ శ్రీనివాస్‌ను రాజేంద్రనగర్ డీసీపీగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన స్థానంలో రాచకొండ కమిషనరేట్‌లో నార్కొటిక్స్ బ్యూరోగా విధులు నిర్వర్తిస్తున్న సునీతారెడ్డి బదిలీపై వచ్చారు.

ఉన్నట్టా.. లేనట్టా..?

ఈనెల 31తో ముగియనున్న సర్పంచ్‌ల పదవీ కాలం

- పంచాయతీ ఎన్నిక నిర్వహణపై స్పష్టత కరువు
- రిజర్వేషన్లపై ఎటూ తేల్చని ప్రభుత్వం
- ప్రత్యేకాధికారుల పాలనకు అవకాశం!
- తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్న ఆశావహులు



షాబాద్ పంచాయతీ కార్యాలయం

షాబాద్: గ్రామ పంచాయతీ పాలవర్గాల గడువు ఈనెల 31తో ముగియనుంది. ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వం ఆంతర్యం ఏమిటనేదానిపై ఇప్పటికీ స్పష్టత రాలేదు. అయినా ఆశావహులు ఇప్పటి నుంచే పోటీ చేసేందుకు తమ వర్గాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికల బరిలో నిలిచేందుకు సన్నద్ధమవుతున్నారు. గతంలో ఉన్న రిజర్వేషన్లతోనే ఎన్నికలు జరుగుతాయా లేక కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని ఏమైనా మారుస్తుందా అన్న సందిగ్ధం నెలకొంది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన కసరత్తు ప్రారంభించాలని కలెక్టర్లను ఆదేశించిన ప్రభుత్వం రిజర్వేషన్ల కేటాయింపుపై మాత్రం స్పష్టతనివ్వలేదు. మరోవైపు రిజర్వేషన్లు తమకు అనుకూలంగానే ఉంటాయనే ఉద్దేశంతో ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలోపడ్డారు.

వివరాలు సేకరించిన అధికారులు

పంచాయతీ పాలకవర్గాలకు ప్రభుత్వం 2019లో ఎన్నికలు నిర్వహించింది. పంచాయతీ రాజ్ చట్టాన్ని సవరించిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థలైన పంచాయతీలు, జిల్లా, మండల పరిషత్, మున్సిపాలిటీలకు కేటాయించిన రిజర్వేషన్లు పదేళ్ల పాటు కొనసాగించేలా తీర్మానిస్తూ చట్టాన్ని రూపొందించింది. ఈ మేరకు మార్చి 2018న ప్రభుత్వం దీనిపై ఉత్తర్వులు జారీ చేసింది. సవరించిన పీఆర్ యాక్ట్ రిజర్వేషన్ల ప్రకారం పంచాయతీ ఎన్నికలను 2019 జనవరిలో మూడు విడతలుగా నిర్వహించింది. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు ఫిబ్రవరి 2న ప్రమాణ స్వీకరం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈనెల 31తో వారి పదవీ కాలం ముగియనుంది. దీంతో ఎన్నికల నిర్వహణ అవశ్యంగా మారింది. ఆ దిశగానే ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొంటూ గత నెల 5న ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఆదేశాలకనుగుణంగా అధికారులు పోలింగ్ సిబ్బంది వివరాలు సేకరించి సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేశారు.

ఎన్నికల నిర్వహణ సాధ్యమేనా?

మరో 27 రోజుల్లో ప్రస్తుత పంచాయతీ పాలకవర్గాల గడువు ముగియనుండటంతో ఆ లోపు ఎన్నికల నిర్వహణ సాధ్యమేనా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం ప్రకటించకపోవడంతో క్షేత్రస్థాయిలోనూ కసరత్తు ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం ఇప్పటికిప్పుడు ఆదేశాలు జారీ చేసినా నిర్ణీత గడువులోగా ఎన్నికల నిర్వహణ సాధ్యమయ్యే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాతే జరిగే అవకాశముందని అభిప్రాయ పడుతున్నారు. ఇదే జరిగితే జీపీల్లో ప్రత్యేకాధికారుల పాలన వచ్చే అవకాశం కన్పిస్తోంది. ఇది ఎంపీ ఎన్నికల వరకు కొనసాగే అవకాశముంటుందని అధికారులు చెబుతున్నారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ సభ్యుల పదవీ కాలం వచ్చే ఏడాదిలో ముగియనుంది. వీటికి సైతం ఎన్నికలు నిర్వహించాల్సి ఉండటంతో పంచాయతీ ఎన్నికలతో కలిపే వాటిని నిర్వహిస్తారనే చర్చ కూడా మొదలైంది. కొత్త ప్రభుత్వం సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలతో పాటు జెడ్పీ చైర్మన్ పదవుల రిజర్వేషన్లు సైతం మారుస్తుందనే ఊహగానాల నేపథ్యంలో ఆశావహులు ఇప్పటి నుంచే తమ ప్రయత్నాలు ప్రారంభించారు. గ్రామస్తులను ఆప్యాయంగా పలుకరిస్తూ ఆయా కార్యక్రమాల్లో పాల్గొంటూ మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఎలాంటి ఆదేశాలు రాలేదు



స్థానిక సంస్థలకు సంబంధించిన రిజర్వేషన్ల మార్పుపై ఇప్పటి దాకా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు రిజర్వేషన్లను కొనసాగిస్తూ చట్టం చేసింది. కొత్త ప్రభుత్వం వాటిని కొనసాగిస్తుందా లేక మారుస్తుందా అనే దానిపై ఆదేశాలు వస్తే తప్ప తెలియదు. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

– హన్మంత్‌రెడ్డి, ఎంపీఓ, షాబాద్

సకాలంలో నిర్వహించాలి



పంచాయతీ ఎన్నికలు సకాలంలో నిర్వహించాలి. లేదంటే పాత సర్పంచ్‌లకే అధికారం ఇవ్వాలి. ఏడాదిగా ప్రభుత్వాల నుంచి నిధులు మంజూరు కాక అప్పుల పాలవుతున్నాం. పంచాయతీ నిర్వహణ భారమవుతోంది. సంవత్సరానికి సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్ బిల్లులు చెల్లించాలి.

– చందిప్ప జంగయ్య, సర్పంచ్, మల్లారెడ్డిగూడ

వినియోగదారుల చెంతకే..

- విద్యుత్ అధికారుల క్షేత్రస్థాయి పర్యటన
- సమస్యలు గుర్తించి.. అక్కడికక్కడే పరిష్కారం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: నిన్న మొన్నటి వరకు ఫిర్యాదులపై పెద్దగా స్పందించని విద్యుత్ ఇంజనీర్లు.. ప్రస్తుతం ఏకంగా ఇళ్లముందే వాలిపోతున్నారు. ఆర్టిజన్ మొదలు సీజీఎం వరకు విద్యుత్ ఇంజనీర్లంతా క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. విద్యుత్ లైన్ల నిర్వహణ, సరఫరాలో హెచ్చుతగ్గులు, అనధికారిక కరెంట్ కోతలు, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లు, వేలాడుతున్న వైర్లను గుర్తిస్తున్నారు. పంపిణీ వ్యవస్థ పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించడంతో పాటు ఎక్కడికక్కడ జనంతో మమేకమవుతున్నారు. వారి దృష్టికి వచ్చిన సమస్యలకు అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపిస్తూ వినియోగదారుల మన్ననలను పొందుతున్నారు. విద్యుత్ సంస్థల ప్రక్షాళనలో భాగంగా ప్రభుత్వం పలువురు అధికారులను మార్చిన విషయం తెలిసిందే. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీగా ముషారఫ్ అలీ ఫరూఖీ ఇటీవల బాధ్యతలు స్వీకరించిన విషయం విధితమే. అంతర్గత నష్టాలను పూర్తిగా నియంత్రించాలని ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో నిన్న మొన్నటి వరకు ఆఫీసు దాటి బయటికి రాని అధికారులు సైతం ప్రస్తుతం మున్సిపాలిటీలు, వార్డులు, గ్రామాలు, కాలనీల్లో ప్రత్యక్షమవుతున్నారు. ఒక్కోరోజు ఒక్కో ఏరియాను ఎంపిక చేసుకుని, సీజీఎం సహా కింది స్థాయి ఇంజనీర్లంతా పర్యటిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో తలెత్తుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకుంటున్నారు.

హర్షం వ్యక్తం చేస్తున్న వినియోగదారులు

ఈ మేరకు గురువారం రంగారెడ్డి సీజీఎం పి.ఆనంద్, రాజేంద్రనగర్ ఎస్ఈ గోపయ్య, షాద్‌నగర్ డీఈ యాదయ్య, కొత్తూరు ఏడీఈ రవీందర్, షాద్‌నగర్ ఏడీఈ మాధవరావు కొత్తూరు మండలం తిమ్మాపూర్‌లో పర్యటించారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, లూజు లైన్లు, ఫ్యూజ్‌బాక్సులను గుర్తించి, వాటిని సరి చేశారు. నియంత్రికల్లో ఆయిల్ లీకేజీలను అరికట్టారు. లైన్ల మధ్య ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. లూజుగా వేలాడుతున్న లైన్లను సరి చేయించారు. ప్రమాదకరంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫర్మార్ల చుట్టూ రక్షణ కంచెలను ఏర్పాటు చేయించారు. అధికారులంతా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేస్తుండటంతో వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కొత్తూరు: విద్యుత్ వినియోగదారుల సమస్యలను కాలయాపన లేకుండా స్థానిక అధికారులు వెంటనే పరిష్కరించాలని జిల్లా జోన్ ట్రాన్స్‌కో సీజీఎం ఆనంద్ సూచించారు. మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్‌లో గురువారం ఆయన పర్యటించారు. పలువురు విద్యుత్ వినియోగదారులతో మాట్లాడి విద్యుత్ సరఫరా.. సరఫరాలో అంతరాయాలు.. సమస్యలు ఏర్పడినప్పుడు సిబ్బంది స్పందించే తీరును అడిగి తెలుసుకున్నారు. సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి సిబ్బందికి, శాఖకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఈ గోపాల్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.



వినియోగదారులతో మాట్లాడుతున్న సీజీఎం ఆనంద్



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక

సమస్యల పరిష్కారమే లక్ష్యం

బాధ్యతలు స్వీకరించిన కొత్త కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పని చేయడం ఒక్కటే తన ముందున్న కర్తవ్యం అని కొత్త కలెక్టర్ కె.శశాంక తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి కలెక్టర్‌గా వ్యవహరించిన గౌతం పొట్రు ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా శశాంక మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఓ వారధిలా పని చేస్తానని చెప్పారు. ప్రభుత్వ విధానాలను అమలు చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ చూపించనున్నట్లు చెప్పారు. అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూస్తామన్నారు. అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి సహా వివిధ శాఖల అధికారులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మూడోసారీ..!

- మూసీ అభివృద్ధి కోసం అధ్యయనం
- సబర్మతికి వెళ్లిన అధికారుల బృందం
- గతంలోనూ ఇలాగే రెండుసార్లు..
- నివేదికలు ఇవ్వకుండానే మరోసారి..
- నిధులు కేటాయించినా ఫలితం శూన్యం

సాక్షి, సిటీబ్యూరో: మూసీ పరీవాహక ప్రాంత అభివృద్ధి కోసం అధికారుల బృందం సబర్మతి నది అధ్యయనం కోసం మరోసారి బయలుదేరి వెళ్లింది. గతంలో ఇదే నదిపై మూసీరివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అధ్యయనం చేసి వచ్చారు. సబర్మతితో పాటు కోల్‌కతాలోని హుగ్లీ నదిని సైతం అధ్యయం చేసి వచ్చారు. కానీ.. ఈ రెండు నదులపై జరిపిన అధ్యయనంపై ఎలాంటి నివేదికలను రూపొందించలేదు. గత ప్రభుత్వ హయాంలో తొమ్మిదేళ్లుగా ఎలాంటి కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసిన దాఖలాల్లేవు. మూసీ అభివృద్ధి కోసం నిధులు కూడా విడుదల చేయలేదు. ఈ క్రమంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి మూసీ అభివృద్ధి ప్రతిపాదనలను ముందుకు తెచ్చింది. రాబోయే 36 నెలల్లో మూసీని అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. అవసరమైతే ఇతర నదులను అధ్యయనం చేయాలని సూచించిన వెంటనే మూసీరివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆమ్రపాలి నేతృత్వంలోని అధికారుల బృందం సబర్మతి పర్యటనకు వెళ్లడం గమనార్హం. ఈ నదిపై గతంలోనే సమగ్ర అధ్యయనం చేసిన అధికారులు మరోసారి కొత్తగా తెలుసుకొనే అంశాలు ఏముంటాయనేది చర్చనీయాంశంగా మారింది. సబర్మతితో పాటు హుగ్లీ నదిని సైతం సందర్శించి వచ్చారు. ప్రభుత్వం మారినప్పటికీ అప్పటి అధికారుల అధ్యయనాలేమయ్యాయనేది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా మూసీ ప్రక్షాళన, అభివృద్ధి కార్యక్రమాలన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయని, కార్యాచరణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉందని విమర్శలు ఉన్నాయి.

తొమ్మిదేళ్లలో రూ.9 కోట్లు..

- తొమ్మిదేళ్ల క్రితమే అప్పటి ప్రభుత్వం మూసీ రివర్ ఫ్రంట్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) ఏర్పాటు చేసినా మూసీ నది లోంచి తట్టెడు మట్టి కూడా ఎత్తిపోయలేదు. కార్పొరేషన్ అలంకారప్రాయంగా మారింది. దీనికి రెండు దఫాలుగా చైర్మన్‌ను కూడా నియమించారు. ఈ తొమ్మిదేళ్లలో మూసీ అభివృద్ధి కోసం రూ.వందల కోట్లు కేటాయించనున్నట్లు ప్రకటించినప్పటికీ విడుదల చేసింది కేవలం రూ.9.12 కోట్లేనని అధికారులు చెబుతున్నారు. ఇది వారి జీతభత్యాలకే సరిపోయింది. తాజాగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి మూసీ నది అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించింది. రెండు రోజుల క్రితం మూసీపై సమీక్షించిన సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. 55 కి.మీ నదీ పరీవాహక ప్రాంతంలో అన్ని వర్గాల ప్రజలకు అనువైన ఐకానిక్ డిజైన్ ఎంపిక చేయాలన్నారు.
- ఎమ్యూస్‌మెంట్ పార్కులు, వాటర్ ఫాల్స్, చిల్డ్రన్ వాటర్ స్పోర్ట్స్, స్ట్రీట్ వెండర్స్ బిజినెస్ ఏరియా, షాపింగ్ మాల్స్ వంటివి అందుబాటులో ఉండాలన్నారు. ఇందుకోసం విదేశాలతో పాటు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో నదీ పరీవాహక ప్రాంతాల్లో ఇప్పటికే చేపట్టిన ప్రాజెక్ట డిజైన్లను పరిశీలించాలని ఆయన సూచించారు. మూడు నెలల్లోగా పనులు ప్రారంభించాలని చెప్పారు. ఆకస్మికంగా వరదలు వచ్చినప్పటికీ తట్టుకునేలా వర్షపు నీటిని మూసీలోకి మళ్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పరీవాహక ప్రాంత అభివృద్ధికి భవిష్యత్తులో ఎలాంటి అడ్డంకులు రాకుండా అవసరమైన అన్ని చరలు చేపట్టాలని చెప్పారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో నెలకొన్న చారిత్రక కట్టడాలైన చార్మినార్, తారామతి బారాదరి ఇతర పర్యాటక ప్రాంతాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ డిజైన్ రూపొందించాలన్నారు. ఈ క్రమంలో సీఎం నుంచి ఆదేశాలు వెలువడిన వెంటనే అధికారుల బృందం గతంలో సందర్శించిన సబర్మతికే మరోసారి వెళ్లడం గమనార్హం.

కిలాడీ లేడీ అరెస్ట్

నాగోలు: జువెలరీ దుకాణాల్లో నగలు కొంటున్నట్లు నటించి సేల్స్‌మెన్ కళ్లు గప్పి నకిలీ బంగారు నగలు అక్కడ పెట్టి అసలు బంగారు నగలు కొట్టేస్తున్న మహిళను సరూర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. అమె నుంచి రూ. 12 లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఎల్బీనగర్ డీసీపీ సాయిశ్రీ వివరాలు వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్లకు చెందిన గోనెల గౌతమి, నరేందర్ దంపతులు నగరానికి వలస వచ్చి మీర్‌పేట జనార్దన్‌కాలనీ, భూపేష్‌గుప్త నగర్‌లో నివాసం ఉంటున్నారు. నరేందర్ సినిమాల్లో జూనియర్ ఆర్టిస్ట్‌గా పని చేసేవాడు. తన భర్త సంపాదన కుటుంబ అవసరాలకు సరిపోక పోవడంతో గౌతమి చోరీలకు తెర లేపింది. ఈ నేపథ్యంలో గత డిసెంబర్ 31న కమలానగర్ లోని లలిత జ్యువెలర్స్‌కు వెళ్లి బంగారం కొంటున్నట్లు నటించి సేల్స్‌మెన్ కళ్లు గప్పి అసలు బంగారు గొలుసు స్థానంలో నకిలీ గొలుసు ఉంచి అక్కడి నుంచి పరారైంది. యాజమాన్యంతో ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన సరూర్‌నగర్ పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. ఆమె నుంచి 190గ్రాముల బంగారు అభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైనట్లు డీసీపీ తెలిపారు. నిందితురాలు గౌతమిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎల్బీనగర్ అడిషనల్ డీసీపీ కోటేశ్వర్ రావు, సరూర్‌నగర్ సీఐ శ్రీనివాస్, డీఐ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న బంగారు అభరణాలను చూపిస్తున్న ఎల్బీనగర్ డీసీపీ సాయిశ్రీ

మోదీ పాలనలో అభివృద్ధి పరుగులు

- వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

మహేశ్వరం: తెలంగాణలో మహిళలకు పొగ నుంచి విముక్తి, భరోసా కల్పిస్తూ 11.52 లక్షల ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు అందించామని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా గురువారం ఆయన మండల పరిధిలోని మాణిక్యమ్మగూడలో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏదైనా కారణంతో కేంద్ర ప్రభుత్వ పథకాల ఫలాలు అందనివారికి చేరువ కావడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమని తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు బాధ్యత వహించి వార్డు, గ్రామం, పట్టణం మొత్తం మీద అర్హులను గుర్తించాలని సూచించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. కాంగ్రెస్ హయాంలో దేశం అన్ని రంగాల్లో వెనుబడిపోవడమే కాకుండా ప్రతి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో అవినీతి పేరుకుపోయిందని ఆరోపించారు. అంతకు ముందు డ్వాక్రా మహిళలకు రుణాల చెక్కును అందజేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాల స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, ఎస్బీఐ డీజీఎం ఎఫ్ఐ మోహన్ దాస్, రీజినల్ మేనేజర్ మధుబాబు, ఆర్డీఓ సూరజ్ కుమార్, జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ మహమూద్ అలీ, ఎంపీడీఓ నర్సింహ, బీజేపీ మండల అధ్యక్షుడు మాధవచారి, ఇన్‌చార్జి ఎంపీపీ కె.సునీతా నాయక్, గ్రామ సర్పంచ్ మాసారం చంద్రయ్య గౌడ్, ఎంపీటీసీ సభ్యురాలు అనిత తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ హంగులు





అజీజ్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, విద్యార్థులకు ఏర్పాటు చేసిన బెంచీలు

ఆదర్శంగా నిలుస్తున్న అజీజ్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

- ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అన్ని వసతులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మొయినాబాద్ రూరల్: సర్కారు బడికి కార్పొరేట్ హంగులు అద్దుకున్నాయి. విద్యార్థుల్లో చదువుతో పాటు శారీరక ధారుడ్యం పెంపొందించేలా ఆటలపై దృష్టి సారించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో 'మన ఊరు మన బడి' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వంతో పాటు వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా సకల సౌకర్యాలు కల్పించారు.

సకల సౌకర్యాలు..

ప్రభుత్వం ద్వారా 'మనఊరు మనబడి'లో గత సంవత్సరం 2.85 లక్షలతో నిధులు కేటాయించి పాఠశాలలో వసతులు కల్పించగా, నగరంలోని వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ప్రత్యేకంగా విద్యార్థుల కోసం టాయిలెట్స్, వాటర్ శుద్ధి ట్యాంక్ ఏర్పాటుతో పాటు హ్యాండ్‌వాష్, నల్లాల ఏర్పాటు చేశారు. దీంతో ఈ పాఠశాల అన్ని హంగులతో జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తోంది. 1వ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు ప్రస్తుతం పాఠశాలలో 266 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని ఆ పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ పాఠశాల ఇటు ప్రభుత్వం అటు స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని పిల్లలను ఇక్కడే చేర్పించాలన్నారు.

చులకనభావం పోవాలి



నిరుపేద కుటుంబాల్లో పుట్టిన పిల్లలు ఉన్నత చదువులు చదవాలి. సర్కార్ స్కూల్స్ అంటే చులకన భావం ఉండొద్దనే ఇలాంటి నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థ సహకారం బాగుంది. అన్ని పాఠశాలలను ఇలానే అభివృద్ధి చేయాలి. పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి.

– జైపాల్‌రెడ్డి, అజీజ్‌నగర్

ఆదర్శంగా నిలుస్తోంది



మిగితా పాఠశాలలకు ఈ పాఠశాల ఆదర్శంగా నిలుస్తోంది. పిల్లలు చదువుకోవాలంటే వారి మానసిక స్థితి బాగుండాలి. ఆటలతో వారిలో మార్పు వస్తుంది.తరగతి గదుల్లో కూర్చోవడానికి, రాసుకోవడానికి టేబుళ్లు ఉన్నాయి.

– రాంచందర్, ఉపాధ్యాయుడు, అజీజ్‌నగర్ ప్రభుత్వ పాఠశాల

మెరుగైన ఫలితాలు సాధిస్తాం



గతేడాది మన ఊరు–మన బడిలో భాగంగా అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కోసం ప్రభుత్వంతో పాటు వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ వారు ఎంతో కృషి చేశారు. పాఠశాలలో అన్ని వసతులు కల్పించారు.పరీక్షల్లో మెరుగైన ఫలితాలుసాధిస్తాం.

– నర్సింహ నాయక్, ప్రధానోపాధ్యాయుడు, అజీజ్‌నగర్ ప్రభుత్వ పాఠశాల

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మాడ్గుల: మాడ్గుల మండలం కలకొండ వాగు నుంచి గురువారం ఉదయం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. డ్రైవర్ ఫకీరా తండాకు చెందిన నరేందర్‌పై కేసు నమోదు చేయడంతో పాటు ట్రాక్టర్‌ను సీజ్‌చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

రెండు ఇళ్లలో చోరీ

శంకర్‌పల్లి: శంకర్‌ల్లి పీఎస్ పరిధిలోని పర్వేదగ్రామంలో బుధవారం రాత్రి రెండు ఇళ్లలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని పర్వేదకి చెందిన శంకరయ్య బుధవారం సాయంత్రం శంకర్‌పల్లిలోని కుమారుల వద్దకు వెళ్లారు. పద్మమ్మ కూడా అదే రోజు వేరే ఊరికి వెళ్లింది. గురువారం ఉదయం తిరిగి ఇంటికి వెళ్లి చూడగా రెండు ఇళ్ల తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బుగ్గ శంకరయ్య ఇంట్లో రూ.40వేల నగదును చోరీకి గురికాగా, పద్మమ్మ ఇంట్లో నగదు, తులం బాంగారం అపహరణకు గురైంది. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

లారీ ఢీకొని..

బైకిస్టు దుర్మరణం

పహాడీషరీఫ్: లారీ ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి చెందిన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్ట నుంచి షాహీనగర్ వైపు గురువారం సాయత్రం ఓ గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వెళ్తున్నాడు. ఎర్రకుంట చౌరస్తా వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి జారిపడిపోయాడు. అదే సమయంలో ఎదురుగా వచ్చిన ఓ లారీ అతని తలపైనుంచి పోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహన నంబర్‌ను పరిశీలించగా రామాంతపూర్ వాసిగా చూపిస్తోంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సంబంధీకులెవరైనా ఉంటే బాలాపూర్ పోలీస్ స్టేషన్‌లో గాని 87126 62366 నంబర్‌లోగానీ సంప్రదించాలని తెలిపారు.

ఫార్మాసిటీపై అపోహలొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కోదండరెడ్డి

- భూసేకరణ ప్రతిపాదిత గ్రామాల్లో పరిశ్రమలను ఏర్పాటుచేయం
- మెగా టౌన్‌షిప్‌తో ఈ ప్రాంతంలో ఊహించని అభివృద్ధి
- ధరణి పోర్టల్‌లో భూరికార్డులను నమోదు చేయిస్తాం
- ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి

యాచారం: భూసేకరణ చేపట్టిన ప్రతిపాదిత గ్రామాల్లో ఎట్టి పరిస్థితిల్లో ఫార్మాసిటీని పెట్టేది లేదని, ఫార్మాసిటీని మరొకచోటకు తరలించే విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన వైఖరితో ఉన్నారని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి స్పష్టం చేశారు. యాచారంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... గతంలో ఫార్మాసిటీ పేరుతో కేసీఆర్ సర్కార్ భూదోపిడీకి పాల్పడి రియల్ వ్యాపారం చేయాలని చూసిందని మండిపడ్డారు. ఫార్మాసిటీని రద్దు చేసే విషయంలో బీజేపీలో ద్వంద వైఖరి కనిపిస్తోందని అన్నారు. ప్రస్తుతం ఫార్మాసిటీ పేరుతో భూసేకరణ చేసిన గ్రామాల్లో కాలుష్య రహిత పరిశ్రమలతో పాటు మెగా టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేస్తామని అన్నారు. శ్రీశైలం–సాగర్ రహదారిల మధ్యన మెగా టౌన్‌షిప్‌ల ఏర్పాటుతో ఈ ప్రాంతంలో ఊహించని అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఫార్మాసిటీ ఏర్పాటు అవుతుందని రైతులు ఆందోళన, భయపడాల్సిన అవసరమే లేదని అన్నారు.

ధరణి పోర్టల్‌లో నమోదు చేస్తాం..

త్వరలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్‌తో సమావేశమై టీఎస్ఐఐసీ పేరుమీద ఉన్న రైతుల పట్టా భూరికార్డులను ధరణి పోర్టల్‌లో రైతుల పేర్లపై మార్చేస్తామని అన్నారు. భూముల క్రయవిక్రయాలతో పాటు రైతు భరోసా పథకం అందేలా చూస్తామన్నారు. ఆయా గ్రామాల్లో ఇక భూసేకరణ కూడా చేసేదిలేదన్నారు. ఈ సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కుర్మిద్ద సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, నల్లవెల్లి ఎంపీటీసీ లక్ష్మీపతిగౌడ్, మాజీ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, నిరంజన్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత ఈసీ శేఖర్‌గౌడ్, నానక్‌నగర్ మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్ తదితరులు ఉన్నారు.

అసైన్డ్ భూమలపై విచారణ జరిపిస్తాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: సిద్దాపూర్ గ్రామ శివారులో ఉన్న అసైన్డ్ భూములను గత ప్రభుత్వం పేదల నుంచి ఎందుకు బలవంతంగా సేకరించిందో విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ డిమాండ్ చేశారు. గురువారం ఎమ్మెల్యే శంకర్ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేను అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శంకర్ నియోజకవర్గంలోని కొత్తూరు మండలం సిద్దాపూర్ శివారులో ఉన్న 334 ఎకరాల అసైన్డ్ భూముల గురించి చర్చించారు. ఈ భూములను గత ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా సేకరించిందని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఒకసారి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నామని, మరోసారి ఐటీ హబ్ ఏర్పాటు చేస్తామని భూములు సేకరించినట్లు గత ప్రభుత్వ పాలకులు చెప్పారని పేర్కొన్నారు. అసలు రైతుల నుంచి అసైన్డ్ భూములు ఎందుకు తీసుకున్నారు, ఎవరి కోసం భూములు సేకరించారు. అన్న విషయాలపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ చేపడితే కీలకమైన అంశాలు వెలుగు చూసే అవకాశాలు ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.



మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఆడబిడ్డలకు అండగా ఉండాలి

ఎమ్మెల్యే సబితారెడ్డి



చెక్కులు అందచేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొత్త ప్రభుత్వం కూడా అమలు చేయాలని ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరై లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకాన్ని ప్రారంభించారని అన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలో ఆడబిడ్డల కల్యాణం కోసం లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని చెబుతున్నారు. త్వరగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాంశేఖర్, కమిషనర్ సుమన్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కడియాలకుంట తండా, మొండోనిబాయి తండాలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..ప్రజలందరికీ న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. అర్హులందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ఎంపీపీ ఖాజా ఇద్రీస్, నాయకులు.. చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, బుజ్జిబాబు నాయక్, ఏడీఏ రాజారత్నం, తహసీల్దార్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



వినోద (ఫైల్)

కందుకూరు: ఓ మహిళ అదృశ్యమైన సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రావణ్ తెలిపిన వివరాలు... మండల పరిధిలోని గఫూర్‌నగర్‌కు చెందిన కరుణాకర్, వినోద(35) భార్యభర్తలు. వీరికి 11 సంవత్సరాల క్రితం వివాహమైంది. కూలీపనులు చేసుకుని జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా బుధవారం రాత్రి సమయంలో భార్యభర్తల నడుమ చిన్న విషయానికి గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన భార్య వినోద గురువారం తెల్లవారుఝామున ఇంటినుంచి వెళ్లిపోయింది. ఎంతకీ ఇంటికి తిరిగిరాకపోవడంతో భర్త కరుణాకర్ కందుకూరు పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ చోరీ కేసులో..

నిందితుడికి ఐదు నెలల జైలు

తలకొండపల్లి: బైక్ చోరీ కేసులో నిందితుడికి గురువారం ఆమనగల్లు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి స్వరూప జైలు శిక్ష విధించారు. ఎస్ఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని జూలపల్లికి చెందిన గోపాల్ జూలై–2023లో సొంత పనుల నిమిత్తం బైక్‌పై తలకొండపల్లికి వెళ్లాడు. బైక్‌ను పార్క్‌చేసి సబ్ స్టేషన్ వద్దకు వెళ్లాడు. పని ముగించుకొని వచ్చి చూసేసరికి పార్క్ చేసిన స్థలంలో బైక్ కనిపించలేదు. బైక్ పెట్టిన ప్రదేశంలో లింగరావుపల్లికి చెందిన అంజయ్య అనుమానాస్పదంగా తచ్చాడుతూ కన్పించాడు. గోపాల్ తలకొండపల్లి పీఎస్‌లో అదేరోజు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కోర్టులో సాక్ష్యాధారాలు పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావండతో సివిల్ కోర్టు జడ్జి స్వరూప.. అంజయ్యకు ఐదు నెలల సాధారణ శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని ఎస్ఐ తెలిపారు.

కష్టపడి చదివితే మంచి ఫలితాలు

- పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్

అబ్దుల్లాపూర్‌మెట్ : పదవ తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదివితే అద్భుత ఫలితాలు సాధించవచ్చని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ సూచించారు. పెద్ద అంబర్‌పేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మిడ్ డే మీల్స్ బియ్యాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రఘునందన్ పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి తనలో ప్రేరణ శక్తి కలిగి ఉండాలని, అదే అద్భుతమైన ఫలితాలను సొంతం చేస్తుందన్నారు. విద్యార్థులు ఇష్టపడి, కష్టపడి చదివితే పాఠశాలకు మంచి పేరు రావడమే కాకుండా తల్లి దండ్రులకు, ఉపాధ్యాయులకు గర్వ కారణంగా నిలుస్తారన్నారు. అన్నం వండటానికి కళాయి పూతతో ఉన్న పాత్రలను వాడితే ఆహారం శ్రేష్టంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామచంద్రారెడ్డి , ప్రాథమిక పాఠశాల అధ్యాపకురాలు శ్రీలత పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న రఘునందన్

ప్రజాపాలన వినియోగించుకోవాలి



ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సూచించారు. పట్టణంలోని ఆర్‌బీ నగర్ కాలనీలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆరు గ్యారంటీల కోసం ప్రభుత్వం సూచించిన విధంగా అర్హులైన వారు దరఖాస్తులు అందించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల లేకుండా అధికారులు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను కొనసాగించాలని ఆయన సూచించారు. అర్హులైన వారందరికి ప్రభుత్వం లబ్ధి చేస్తుందని ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్, నార్సింగి ఏఎంసీ చైర్మన్ డి. వెంకటేష్‌గౌడ్, కౌన్సిలర్లు భారతమ్మ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

నెట్‌వర్క్ లోపం.. పింఛన్‌దారులకు శాపం

శంషాబాద్ రూరల్: ఆసరా పింఛన్ దారులకు ఇబ్బందులు తప్పడంలేదు. నెట్‌వర్క్ సరిగా లేక పింఛన్ల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుంది. మండలంలోని ఘాంసిమిగూడలో ప్రతి నెల పంపిణీ చేసే పింఛను డబ్బుల కోసం స్థానికులు అవస్థలు పడుతున్నారు. గురువారం మధ్యాహ్నం పంచాయతీ కార్యాలయం వద్ద ఆసరా పింఛను డబ్బుల పంపిణీ చేపట్టగా.. అక్కడ నెట్‌వర్క్ సరిగా లేక పంపిణీలో జాప్యం జరుగుతుంది. వీరందరూ గంటల కొద్ది అక్కడ నిరీక్షించక తప్పడంలేదు. ప్రతి నెలా ఇలాగే ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఘాంసిమియాగూడలో ఆసరా పింఛన్ల కోసం గుమికూడిన లబ్ధిదారులు